# ఊఁమింటలు చిల్లారవు

నచ్చియ్యి మాఁవ నెగిసీతప్పుటికింకా కసింత కసింత సీకటుంటాది. తిట్టుకుంటానే నెగుస్తాడు ముసిలోడు. ఆడి మంచానికి నేసిన్నులకామూల్నీమూల్ని తెగిపోనాది. అదెప్పుడు సేసినారో యేటో ఆమంచం - ఎదురుబొంగుల్తోటి-దానికే వుంటాదిగాఁవాల నచ్చియ్యి మాఁవంత వొయిసు. అ కుక్కిమంచం మీన బొంతగుడ్డ - బొత్తిగ పనికి రాకంట సినుగులు బడిపోనాది. ఈ సినుగుల్లెఁవ్వడా- సినుగు సినుక్కాడా పట్టిడేసినల్లులు. "సిటం కునుకు నేకంట పేనాలు తినేస్తన్నాయిరా యీనల్లులు" అంతుంతాడు నచ్చియ్యి మాఁవ. ఈ నల్లులికి సాయిం రాతిరి కాడ్నుండి జిడజిడఁవని సీడనాఁగ తగులుకుంది వోన, ఉండుండోపాలి రాఁవినాయుడి సాల్లెల్లి పేడకంపు పారొస్తంది. ఆడిబక్కల్నింతాడ సంతకెల్లా - పాల్సుక్కల్నేకపోయినా - పేడకల్లు ఎయ్యినానికేం నోట్నేదుకదా ! ఆడి పసువుల్సాల పక్కన గుడిసున్నందుకు పేడకంపు, దోఁవల బాదా తప్ప కంటున్నాయి నచ్చియ్యిమాఁవకి. ఈ బాదల్తోటాడికి రాతి రాత్తిరల్లా నిద్దరుండిసావదు. అందిక నేగదా - పొగుటిపూట అంబల్తిసీసినాక - ఆడనాగెల్లి ఓపాలి అంజినేయులు గుడికాడ ఓసిటం తొంగుంటాడు. అప్పులిచ్చీ, తనకాలు పట్టీ వూరోల్ల పొలాలన్నీ యెండేసిన పాపం పోవాలని గావాల-కిల్లఁవ్ శెట్టి బంగాఁరాజు- సావుకారంటే మరనకు, మాగనవైన సావుకోరు - యీగుడినికట్టించి - నున్నాగ గచ్చులు సేయింపించినాడు. ఇంటికాడ సుకఁవ్ లేనోల్లల్ల యీ గుడికాడికేవొచ్చి తొంగుంతుంతారు. నున్నాటిగచ్చుకదా మరి - ఆల్లకిపేనాల్నెగిసొచ్చి నట్టుంతాదిగావాల.

అలవాటు పెకారం యియాలగూడా బాగాపెందిలే నెగిసిపోన్డు నచ్చియ్యిమాఁవ. నెగ్గానోసిటం కూకోని, సుట్టెలిగించి, రాఁవినాయుడ్నీ, పేడకంపునీ దోవల్నీ నల్లుల్నీ పేరు పేరెట్టి తిట్టీవోడు పెతీరోజు. మరియ్యాలదేటో గాని తిట్టకంటే నెగిసిపోన్డు. నెగిసిపోయి పలకర్ర సెయ్యినానికి లోకసఁవుద్రం సెరువుదుక్కు బయిలెల్నాడు. మొగల్డొంకల కాడికొచ్చీతప్పుటికి, ఎదరగోర్జిలెల్లి పరిగెట్టి పారొస్తన్న సీఁవ్వాద్రిగాడు యెదురైపోన్డు నచ్చియ్యి మాఁవికి. పరఁవటీది సిన్నంనాయుడి కొడుకన్నమాట యీగుంటడు- తాతపేరెట్నారు సింవ్వాద్రి నాయుడని. కుర్రోడు కదింక- ఏరో సింవ్వాద్రీ అని పిలస్తారంతా. నాఁర్లోలయినక యీడూ తండ్రినాగే కద్దరు కఁవీఁజూ కండువాయేసి, కొంపలకి అగ్గెట్టడం అరంబంసేస్తే - ముదరోల్లయీది, నేతోల్లయీది - అందరు "దండాల్దండా లండీ సీఁవ్వాద్రినాయుడుబాబూ" అని పెద్ద పెద్ద దండాలెట్టడవూ మొగం సాటవగానే తుపుక్కున వుయ్యిడం

జరక్కతప్పుతాదేటి ?

అయితింత కేటయిందంటే, గోరిజంట పరిగెట్టి పారొస్తున్న గుంటపాపడు నచ్చియ్యిమావ కెదరైపోన్డు. టైంవుకుదరాలగాని, బోగట్టాలకి దిక్కంట ఎవుడ్నే నొగ్గేస్తాడేటి నచ్చియ్యి మావ! ఒగ్గడే! గుంటడ్ని సూసీసూడగానే " ఏట్రోరయ్యా, ఇంకా నిండా తెల్లార్నేదు, సూస్తే కుర్రోడివి అప్పడే ఈస్టొట్టిపోతన్నవ్ " అన్నాడు

" నీకు తెల్దేట్రతాతా " అని అడిగినాడు సివ్వాద్రి.

" ఏటి తెలాల్రా ? ఏటేన్జరిగినాదేటి ?"

" గంగులుగాడికొడుకు సిన్నిగాడు సెర్లొపడిపోన్డతాతా"

"ఏటీ మన్నాకలి గంగులుగాడి కొడుకే ?"

" ఆడేన్ర - మరాడే పడిపోన్డో, ఎవులుతోసీసినారో తెల్దుగాని - ఎల్తురొచ్చీతప్పుటికి సెరువుకాడి కొచ్చినోల్లందరికీ ఆడి శవ్వే కనిపించినాదట. ఊరంతా సేరిపోనరక్కడికప్పిడే"

" అన్నా, ఏంగోరకలొచ్చి పడిపోంద్రానాయినా యీ సాకలోడికి" అని యిసారపడిపోతా, గబగబ సెరువు దుక్కు నాలుగడుగులేసినాడు నచ్చియ్యిమావ.

రేతిరి కాడ్నుండి ముసురెట్టిసిందేవో- బురత్తో సిత సీతనాడిపోతుంది సెరువుగట్టల్లా. గంగులుగాడి కొడుకు సెర్లొబడీ సచ్చిపోన్డని తెలిసీ తప్పుటికి వూరువూరల్లా తిరాబడిపోన్రు . ఇత్తలింతమంది జనం సేరిపోడం - అత్తల కొంతమంది నీట్లదిగి సచ్చినోడి సెవాన్ని గట్టు మీనకి సేరస్తుండం - గట్టుమీన యేపసెట్టు కింద అమ్మోరిగ్గిరం కాడ కర్నం, నాయుడు, నర్సునాయుడు, రాంవి నాయిడూ నిలబడిపోడం, - యియన్నీ సూత్తప్పటికి మతిపోనాది నచ్చియ్యి మాంవకి. పలకర్ర జల్లీసి, జల్దిగో రెండు బుక్కల్నీళ్ల పుక్కిలించీసి, గబగబనడ్సుకొని, నలూగురూ పోగయిన కాడికి పారొచ్చినాడు. పారొచ్చి " ఏట్రయింద్రయ్యి, ఏలింత గోరం జరిగి పోనద్రయ్యా" అని సణిగినాడు.

అయితే, ఎవుడు నెప్పుగల్డిడికి జవాబు ? ఎవుడికెరిక ఏటయినాదో ? బగ్గోలబొట్టిడు బగాదిగాడికి యీ ముసిలోడ్ని చూస్తే ఒల్లుమంట, వూర్లేదిసేసినా, ఎందల సూసినా యీ ముసిల్నా కొడుకే అని సికాకు. ఒకట్రెండు దపాలు నచ్చియ్యి మాంవ మొకంముందే నసి గేసినాడీమాట. అయితే, గుంటసజ్జేవో అనీసినారనీ, జడిసెనక్కి తగ్గిపోతాడేటి నచ్చియ్యిమాంవ ?

" బాబ్బగాదొరే, పెద్ద బుర్రనేక పోతే ఎద్దుబుర్రెట్టుకోంవని సాంవితుందిరా ! నాను బతికున్నాను కాబట్టి, ఎందల బడితందల బుర్రెట్టి, ఇదిగినాగని సరుదుకొస్తన్నాన్రా. ఈకాలపు సోకుల్నేర్చిన గుంట్లు మీరు - మీకెనగుంటాయిరా ముదరోడి మాట్లు రుసీగ ! అయితొరే !

నివ్వుగుంటడివి గుంటడిగి వుండిపోతావేట్రా ? నివ్వు పెద్దోడివౌతావు - అవుతావు, గుంట్లకి టోదపర్సనానికీ తయారౌతావు, సీవాట్లూ తింటావు. అప్పుడ్నీ కెరికవద్దిరా - నచ్చియ్యి మాఁవెందుకినా కింటా మీదా ఏడీ వోడ్! "అని బగాదిగాడి కెదురుజవాబు సెప్పినాడు నచ్చియ్యిమాఁవ.

" ఎల్లెల్రా ! మాఁవుగూడ నీనెక్కలోనే తయ్యారవాలని గావాల సూస్తన్నావు. నిన్ను సూస్తున్నాం సాల్దేటి ! రేపు మమ్మల్ని కూడ కుర్రనంజకొడుకుఁలంతా సూసి యిసుక్కోవాలన్నమాట." అని జవాబిచ్చీసిండు బగాదిగాడు. అదిగా బగాదిగాడే నచ్చియ్యిమాఁవ దుక్కు ఎర్రగా సూసినాడిప్పుడు. ఆడుకోడి కుయ్యినానికి ముందే నెగిసిపోయి పొలంలెల్లి నీరొగ్గీనానికి పొలంకాసొచ్చినాడు. కసింత ఎల్తురొచ్చి నాగ్గావాల, పొలంలెల్లి సూస్తప్పటికి, సెరువుగట్టుమీజ్జనంకనపడతన్నారు. ఏటో సూడాలని పార బుజానేస్కొని గట్టు మీదకి పారొచ్చాడు. సూత్తన్నప్పటికి మరేటుంది- గంగులుగాడి కొడుకు సిన్నిగాడు సెర్లో పడిపోన్డు.

బగాదిగాడికి దుక్కం ముంచికెలిపొచ్చింది. సచ్చిపోయిర సిన్నిగాడు ఆడికినేస్తం. ఆడూ, సిన్నిగాడు, కర్ణంగారి బామ్మర్ది సినపోలిగాడు, నర్సునాయ్డు కొడుకు తవిటిగాడు - యీల్లంతా నేస్తులు - పేకాట్నేస్తులు. దాన్నంయితనాలకట్టులవోర కూకుని, సుట్టలుకాల్సుకోని యీల్లంతా పేకముక్కలాడుకునీవోళ్లు. అనాటి పేకాట్నేస్తం సిన్నిగాడియ్యాల సెర్లోపడి సచ్చిపోనాడంటే ఆడికిదుక్కఁవ్ రాకుంట వుంటాదా ? అయితే మొగోడు కాబట్టి కల్లు వుఁలివీస్కొని, దుక్కాన్నాపీసుకున్నాడు. అదిగనాటి సఁవయఁవ్‌ల యీ నచ్చియ్యి మాఁవగాడు, మడుసులు మద్దిని దూరి " ఏట యింద్రయ్య, ఏటయింద్రయ్య" అనడిగినాడు. బగాదిగాడికి ఎర్రికోపం నెగిసిపోనాది. ముందూ ఎనకా సూడకంట- అగ్గిపోర్సునాగ నెగిసిపోన్డు " ఏటా, ఏటయిందో తెల్దేట్రా ముసిల్నంజికొడకా ! పావుఁల్లతోక, వుడుఁవుల్లబుర్ర అని ఎందలబడి తందలకే పారొస్తావు. నివ్వు కావేట్ర యీడ్నియాల సంపీసింది ? " అనగినాడు నిక్కచ్చిగ.

ఈ మాట్లు యినీతప్పటికి సుట్టూ సేరిన జనఁవల్ల కబ్బయిపోన్రు. నచ్చియ్యిమాఁవయితే బొత్తిగ బిక్కసచ్చిపోన్డు. ఒక్క సిటంఅయినాగ్గావాల "ఏట్రాబాబూ, నివ్వేటంటన్నావో నీకు తెలస్తందిరా? నానట్రా యీడ్నిసంపీసినాను ?" అన్నాడు.

" నివ్వుకాకపోతే మరెవుడ్రా యీడ్నియ్యాలసంపీసింది- ముసిల్నాకొడుక ! మాఁవెవుడి జోలికెల్లకంట వల్లకోమూల్ని కూకోని పేకాడుకుంటంటె - సూసోరవనేకపోనావు. పెద్ద మరియాదస్తుడ్నాగ మా ముంగలికి పారొచ్చి యీ సచ్చిపోయినోడికి సీవాట్లెట్టనేదురా నివ్వు ? అదిపోనీ- అక్కడితో నేన నోర్మూసుకొని కూకోకంట అడయ్యికాడికెల్లి "ఒరయ్యి పేకాటాడినీ కొడుకు సెడిపోతంద్రా " అని సెవులు కొరికినావా నేదా? ఆగంగుల్నంజికొడుకో యెర్రి పీరు. నీ మాట్లిని

కొడుకున్నావజంపేసినాడు. ఆడితిట్లు యిన్లేక ఆడితన్నులు పడ్నేక యీడు సెర్లొ గెంతీసినాడు. మరిప్పుడు సెప్పర - ఆడి సావుకి నివ్వు జవాబుదారివో కాదో! "

బగాదిగాడి మాట్లుయినీతప్పుటికి నచ్చియ్యమాఁవకి మూర్చొచ్చినంత పనయినాది. "ఓర్దేవుడో, యీడు సెప్పింది నిజఁవేనేటి? ఆడిబాబుతో సెప్పినిమాటా నిజఁవే, ఒరయ్యె నీ కొడుకు నోసుట్టు కనిపెడతుంద్రా-అని. అయితే, తనుసేసిన కసింతతప్పు కేయింతటి సిచ్చా? " ఈ సెకారంగా ఆలోసించి బెంబేలు పడిపోనాడు నచ్చియ్యి మాఁవ. ఆడిక్కాల్లూ సేతులూ ఆడ్నేదోసిటం.

ఇంతల గొల్లుమని యేడుపినిపించినాది. అటు దుక్కుసూస్తప్పుటికి- సాకలి గంగులుగాడు గోలబెడతున్నాడు, పరిగెడతన్నాడు, తనూ సెర్లొ బడిపోతానని. నలుగురుమడుసులాడ్ని ఆపి, దూరంగ నాక్కెలిపోన్రు. నాక్కెలిపోయి అమ్మోరిగ్గిరంకాడ అడ్నికుదేసి- సుట్టా కూకున్నారు ఆడ్ని కదల్నివ్వకంట. గంగులుగాడ్ని నూసీతప్పుటికి నచ్చియ్య మాఁవకీదుక్కఁవాగనేదు. ఆడికొక్కపాలిగవొంట్లోని సత్తువల్ల నాగేసినట్టయిపొనాది. బిక్కసచ్చిపోయి- తపతపనడుసుకుంటెల్లి మర్రిసెట్టుకింద సతికిలబడిపోన్డు. సతికిలబడిపోయి సింకిగావంచాతో కల్లొత్తుకున్నాడు.

వోన జోరయింది. కర్ణఁవూ, నాయ్డు, నర్సునాయుడు రాఁవినాయుడు ఏపసెట్టుకిఁద నిలబడి మజ్జిగుజ్జిలు పడిపోతన్రు, సెవాన్ని దానం సేపించీడఁవా మాన్డవా అని. దానఁవ్ సేసెస్తె పోలీసోలొచ్చి ఏఁవల్లరనెగదిస్తారో యేటో ! బాగాలోసించాలోసించి నర్సునాయిడన్నాడుగద, -"ఊఁ, కానీంద్రయ్య, నానేదో కిందామీదా పడ్తాను పోలిసోల్లతో, బేక్కాల్సింది సెవాన్ని. కాదుపోదంటే, కానో, పరకో సేతలెట్టెస్తె సడీసపుడ్నేకంట ఆల్లే జారుకుంటారు" అన్నాడు . అయితింతల, వోన జోరయిపోనాది.

జనఁవల్ల మర్రిసెట్టు కిందికి చేరుకున్నారు. నాలుగడుగుల కవతల అమ్మోరిగ్గిరంకాడ, పేణంపోయినోడ్నాగో, రాయినాగో కూకున్న గంగులుగాడు నచ్చియ్యిఁమావ కల్లబడ్డాడు. ఒక్కసారి పౌరుసం, దుక్కఁవ్ నెగిసిపోనాయి ఆడికి. పూనకఁవో సల్జోరఁవో వొస్తే వొనుకుతారు సూడు మనుసులు, ఆసెకారం వొనికిపోతా నెగిసినాడు.

"ఇనంద్రయ్య ఇనండి - మీరంతినండి-ఇందాక నన్ను ఆ గుంటడెంతనేసి మాట్లన్నాడో మీరంతా యిన్నారు. ఇంతకాలం మట్టినన్ను సూస్తన్రు కదా-నా నెప్పుడేన, ఎపుడికేన, సెడ్డసెప్పినానేట్రా? ఆగుంటపాపడు సెర్లొపడిపోయి గంగులుగాడి కింతటి అన్యాయం సేస్తాడని నానేటి కలగన్నాన్రా ? గుంటడు సెడిపోతన్డు - ఆడయ్య అసలే బతుకల్ల బుగ్గయిపోయి బతకతండు- ఈ గుంటపాపడిమీనె కసింతాసెపెట్టుకున్నాడు అనాటప్పుడు యీడుకూడ సెడిపోతే ఆపెద్దోడికి దిక్కేటి అనిపించినాది నాకు. అందికనే నాలుక్కీకలేసినాను. నాన్సేసిన యీ కసింతపనీ తప్పయితే- వుయ్యండ్ర, నా మొకమ్మీన మీరల్ల- వుయ్యండ్రయ్య ' అని సంటిగుంటడ్నాగ యేడ్సినాడు నచ్చియ్యి మాఁవా.

" పామోర్కారా తాత ! అదేటది, గుంటడు, ఆడి మాటలకి నెక్కేట్రా! ముదరోడివి నివ్వు-ఆడేదో పిల్లోడని నివ్వూ పౌరుసం పడిపొతే, మరి మాకూ నీకూ తేడా ఏట్రా ? గంగులుగాడికీ నీకూ నేస్తం కలిసింది-అందికని ఆడికొడుకు సెడిపొతన్డంటే నీకు సాలొచ్చింది. నాలుక్కీకలేసినావు అంతమాతరానికి నివ్వే ఆడిసావుకి కరతవంటే అదేం నాయం?"అని సర్దనానికి తయారైనాడు సెట్టుపొతయ్యి. "అదిగదిరామాట ! నీకొడుకో అల్లాడి కొడుకో అయితే నాను కీకలేస్తానేట్రా ? ఎవుడెందల బడిపొతే నాకేట్రా ? ఈ గుంటడు గంగులుగాడి కొడుక్కాడా, అందుకని నాలుగు తిట్టి నాన్రయ్యి. ఆ గంగులుగాడు ఎంత నెక్క సెడిపోన్డో మీకేటెరికిరా ? ఆడిబాదలింటే ఎనాటోడికేనా గుండిసెరువైపొద్దిరా " అన్నాడు నచ్చియ్యమావ

"ఐతొరెదడ్డా! ఈ గంగులుగాడు మనూరుపారొచ్చినాడుగదా, యీడిదసలే మడకరా?" అనడిగినాడు సొట్టిప్పిగాడు. " ఆడిదే మడకని సెప్పమంటావ్ ? ఆడి బతుకునాటి బతుకు-అనాటి బతుకు ఏగొడికేనొద్దురయ్యి ! ఆడీవూరేల పారొచ్చినాడో మీకెరికా ?సెపంచికానికి మొకం సూపనేక, ఎవుడికీ తెలకంట యేదో మూల్న పడుండాలని, యిళ్లూ వొకళ్ళూ అమ్మొసి మనూరు పారొచ్చినాడు-రాజాం సుట్టు పట్లంట రాజా నాగ బతికినోడ్రయీాడు."

" ఏట్రా - రాజాంకాడ్నుండియింతనెక్క పారొచ్చినాడా ? అంత కష్టిం ఏటొచ్చినాదో ఆడికి?"

"అదేట్రనాయినా- కాలం, కరవం కలిసిరాకపోతే మనిసేటి సెయ్యిగల్డు సెప్మీ? సెడిపోయి రోజులొచ్చినాయంటే, నాలుక్కోసులేనా ఎల్లాల, నలపియ్ కోసులేనా యెల్లాల".

"రాజానాటి బతుకొగ్గిసి మన మడక్కి పారొచ్చినాడంటే, ఆడికేదో పెద్దాపతే వొచ్చుండాలమరి"

" పెత్తాపతనిమెల్లిగంటావ్ ! ఒరప్పియ్యి, నివ్వేట్ర ? నివ్వూ గుంటుడివే కాదేటి ? మీనాటి గుంట్లకింక పూరాగ తెల్దురా - యీ పెపంచికంల నాయిం పూరాగ సచ్చిపోనాదని. ఈ పెపంచికంల అన్నాయిం కాక మరేటే మున్నాదేటి ? గంగులుగాడికొచ్చిన ఆపత ఆడికొక్కడికే వొచ్చిన ఆపతనుకుంతన్నావేటి ? మనొంతూ వొస్తాదిరయ్యి - యియ్యాలప్పుడు కాకపోతే మరోనాడు. ఆడియ్యాల దొరికి పోన్డు - రేపు మనొంతొస్తాది - అప్పుడు మన బతుకులూ సెల్లే. అంతేన్ర మన బతుకుల యిలవ."

"అయితొరే తాతా, యియ్యాలల్లా యేదాంతవే సెప్పుకొని కూకుంతావా - నేకపోతే గంగులుగాడి సంగతి కసింత సెపుతావా ? సెప్పురా యింటాం - ఓనసూస్తె సుట్టముక్క తెచ్చుకోనానికేనా నెగనీకంట సంపేస్తంది -"అనీసినాడు సెట్టు పోతయ్యి. ఆడికి బొత్తిగ ఓరుపు

తక్కువ. ఆడిదుక్కు తిరిగి అన్నాడుగదా నచ్చియ్య మావ "మన బతుకులే ఏదాంతంరయ్య. దాన్నొక్క పాలొగ్గేసి, నివ్వు గందికయ్ పోతన్నావు గనక సెప్పుకొస్తానినుు. ఈ గంగులుగాడి బతుకే సెకారంగా అడివిబతుకు పాలైపోనాదో మీ కెరికా ? ఈడసలు పుటక్కి మడియారయినా రాజానాగ బతికినోడ్ర. అయితీడి కెనాటి సెనిపట్టిందెరికా ? బంగారబ్బొమ్మల్లాంటోల్లు పిల్లలై యీడికి పుట్టేసినారు. అదే యీడిపాలిట సెనైపోనాది. అందల యీడికూతురట- ఆ గుంట సెందమాఁవ నాగుండీదట - గంగులుగాడదే సెప్పుకొని ఏడస్తుండీవోడు. ఈడు సూస్తెసొకలోడు. ఇంటికాడ సూస్తే రంబనాటి కూతురు - సుట్టాకూకోయున్నారు మోతుబర్నాయళ్ళల్లా నక్కపోతుల్నాగ. అలాటోల్ల మద్దినీ గౌర్రిపిల్ల ఎంతకాలం బతుక్కొస్తాది సెప్పండ్ర మీరే ! "

"ఓ నాడా గుంటపాప-ఎవురనుకుంతన్రారా - యీ గంగులుగాడి కూతుర్రా - అదేఁవో పుతికేసిన గుడ్డ ముక్కలొట్టుకొని రేవు కాడ్నుండి యింటికి పారొస్తున్న టఁయిఁవ్‌ల కసింత సీకటి పడిపోనాదట. అయ్యిగాని, అన్నగాని - యీ సచ్చిపోయినోడికది సెల్లిల్రా - అయ్యాలదానెంట తోడ్లేరట."

" దద్దారే మరైతా గంగులుగాడికి పెల్లాం నేదేట్రా ? "

" ఇంటికాడ ఆడదాయేవుంటే యీడి కరఁవం యెందుకినా కాలిపోద్ది ? రెండోపాలి కొడుకునికని, యీడిపెల్లాం పురిట్లోనే సచ్చిపోనాదట గుర్రపువాతఁవొచ్చి. పిల్లల దుక్కుసూసి మల్లీ పెల్లిసేస్కొకంట వుండిపొనాడీడు. పిల్లలంటె అంతపిమానం ఆడికి. నాను సొయంగా కొంతనెక్క సూసి కొంతనెక్కయినా తెలుస్కున్నాన్రా ఆడిఅపిమానాలు"

" ఇంతకాడి కూతుర్సింగతేటయింద్రా దద్దా ?

" ఏటయుందా ? ఏటయిందని సెప్పుకుంటాడు ? ఆడుయీనాటికి నోరిప్పి యిదిగీరకంగా నాకూతురి బతుకు బుగ్గియిపోనాదని నోకానికి సెప్పుకున్నాడేటి ? మొన్న సంకురాత్రినాడు గావాల నాకు తెలిసొచ్చింది ఆడికష్టం. అయ్యాల ఏటయినాదెరికా? తెంపునేకంట కల్లనీల్లెట్టుకొని ఏడస్తండు. ఏటయినాదని పలకరించినాను. పండుగపూట ఏడుపేట్రానాయినా అని ఓదార్చినాను. అయితేనానీ యితంగ పలకరించీతప్పటికి ఆడికి దుక్కంమరింత నెగిసిపోనాది. పై బట్టల మొగం సాటుసేస్కొని యెనాగేడ్చినాడెరికా ? నానలాగ కసింతసేపు ఆడికొదార్పుసేసి వూరుకోర్నాయినా అని బోదపర్చినాను. " ఓర్నచ్చియ్యి మాఁవా - నా బతుక్కి సంకురాత్రిరేట్రా? నాకు పండగలేట్రా ? నాకు మిగిల్నియల్లా యేడుపులేన్ర! అచ్చ బంగారం ముద్దనాటి కూతుర్నోకాడ బలెట్టేసినాను. ఒజ్జిరం నాటి కొడుకునో కాడ బలెట్టేసినాను. దొడ్డిడుగేదలు సచ్చిపోనాక గుడ్డిగేదె సివాలచ్చిమని యీడ్నినమ్ముకుంటే యీ పెద్దోడు పేకాట్లకి, సారాలిక దిగిపాతండు. ఆ తాటిచెట్టు బతికింది, మోడునాగ నానూ

బతికినాను'- అని ఒకటే గోలెత్తిసినాడు. అడి మాట్లసితప్పుటికి నాను గతుక్కుమన్నాను. ఆడు రెండేల్ల పొద్దయిందీవూరు పారొచ్చి, ఈ రెండేల్ల పొద్దులో మాటొర్సకేనా ఆడ్నోట్నుగాని, యీ సెర్లో పడిపోయినోడి నోటగాని యిన్నేదే - ఈడికిపిల్లలుండీవోరని. ఇందలేదో పెద్దతిరకాసే వుండాల. నేకపోతే కడుపున్నాసిన బిడ్డల పూటెత్తకంట గుండి రాయి సేస్కొని ఎవుడేనుండగల్డేటి అని కసింత సేపాలోసించినాను. ఒక్కసిటం ఆగినాక అన్నానుగదా, ఎట్రాయ్య, యీడుకాక నీకింకిద్దరు పిల్లలుండీవో రేట్రా అని.

"ఇచ్చినాడ్ర నచ్చియ్యమాఁవా - దొంగ సచ్చిన్దేవుడు ముగ్గురు సంతానాన్నిచ్చినాడ్ర. ఇచ్చినట్టిచ్చి అందలిద్దర్ని నాక్కెలిపోనాడు. నాకు తెలకంటె నానేటి సేసినానో ఏటో నాయేలెవెట్టి నాకన్ను పొడిసీసినాడు - నేకపోతే ఒరాల్నాటి బిడ్డల్నిచ్చి ఆల్లన్నాకల్లముందే సంపీసి నన్నేడ్సి సావురా నంజికొడుకా అని ఒగ్గీసినాడుకదా - ఆడెనాటి దేవుడ్రా" అని మల్లొపాలి బారుమన్నాడు.

"ఏడకర్మాయిన నాన్నీకు తండ్రంతటోడ్ని. నాతో సెప్పుకోరా యేటయినాదో. నాలాటోడితో సెప్పుకుంటే నీ బాత్తగ్గుద్దేటో కసింత" అని ఓదారుపుసేసినాను. అదిగప్పుడు సెప్పుకొచ్చినాడు- ఇప్పుడీ సచ్చిపాయినోడు నేడా - ఆడెనకాల పుట్టిందాయట కూతురు. ఆ గుంటదేఁదో దేవుతలి రూపూ దేవుతులి గునవుఁనట. తమ్ముడుపుట్టీ, తల్లిసచ్చిపోనాక, ఏది- బొడ్డూడ్ని యీగుంటే తిప్పిందట సంసారం వల్ల. అత్తల సంటోడ్ని సూసినట్టు- యిత్తల అన్నకీ, అయ్యికీ కూడొండినట్టు మరేఁవో రేవుకాడ పొయ్యికిందికి సితుకులు ఎగదోసినట్టు యినాగ నడిపించుకొచ్చి నాదట యిల్లు. తండ్రికి కడుపోడ్నిచ్చిది కాదట్ర కూతురు - ఆడు సెప్పుకోని గోలెట్టీసినాడు - నాయమ్మో నాయాలో బతికున్నా నాకాయితంగా సాకిరి సేసుండరయ్య నచ్చియ్యమాఁవ, ఆనెక్కన్నడిపించికొచ్చిందిరా నా బిడ్డ' అని గొల్లుమన్నాడు.

"అచ్చ బంగారం యిగ్గరానికి సాయిపసుపు నలుగెడితే ఎలా మెరిసిపోద్దో అదిగనాగ మెరిసిపోయీదట్రయ్య గుంటపాప. ఇస్త్రీబట్టలోట్టుకొని అదిగాని యీదిలెల్లి ఎల్తుంటే, పతీవొక్కడు, ముతకయీది, ముసిలయీది పనొగ్గిసి సిల్లంగెట్టీ వోల్లనాగ ఆ గుంట దుక్కు అనాసూస్తుండి పోయీవోరట. ఈ గంగులుగాడేఁవో పతీరోజు కూతురుకి రెండు మిరపకాయిలూ, రెండుప్పుగడ్లు దిస్టితీసి పొయ్యిల పడీసివోడుట - "అయ్యా పతీరోజు నాకు దిస్టి తగుల్తాదేట్రా" అని కిస కిస నవ్వీదట్రా గుంట - యీడిసేదస్తం సూసి. నీకు తెల్దు పల్లకోయే అనిగసిరీవోడట యీడు.

అంత అఁవాయికంగ, సర్దాగ, ఏది - డొంకనంట మొగిలిపువ్వు పూస్తాది సూడు- ఆయితంగ పెరుక్కొచ్చిందంట, గుంట. మరనాటి బంగారం తీగి నాటి గుంటకి నాయుల్లీదిలెల్లి నడ్డానికి బయిఁవెయ్యిదా? నాయిళ్ళు సూస్తే డబ్బులు గడించీసి వూటెక్కి పోయున్నారు - సేపా, నీసు

తినీసి, సారా తాగీసి, మీసాలు నలుపుకుంటూ ఆ నాకొడుకులు అరుగులు మీద కూకొనుంటేయే ఆడదాయికి వుంటాందిరా దయిరవు ఆల ముంగల్లెల్లి నడ్వానికి ? గంగులు గాడి కూతురికి ఆసెండాలం నా కొడుకుల సంగతి తెలక్కాదు, అయితాయాల దాని కరంవకాలిపోవాలని బెమ్మరాసి యెట్టిసినాడు. సీకటడిపోతంది, సుట్టూ తిరిగి ఏ తోల్లపెండిపక్క లెల్లెల్తే పురుగుపుట్రా వుంటాదేటో,ఒక్కడుగుబేగి యింటికెల్లి పావాల, వూష్టాంవొచ్చి యింటికాడ అయ్య తొంగోయున్నాడు, అని నాయల్లీదిలెల్లి బట్లమూటొట్టుకొని సెర సెర నడిసెల్లి పోతందట. సలికాలం పారొచ్చిందేవో, ముసిలీ ముతక కసింత సీకటియీతప్పటికీ ముసుగుల్తన్నీసి తొంగోయున్నారో యేటో యీదల్లా దివ్వు దివ్వు మంతందట. ఈ గుంటకి గుండల్లెల్లి బయిం నెగిసిపోయి గబగబ నాలుగడుగులేసిందట. ఇంతల సెపామని ఎవుడో తొత్తుకొడుకు దీన్నొడిసి పట్టుకున్నాడట. ఇదేం వో వోరయ్య సచ్చిపోనాన్రో అని కీకెయ్యి బోనాదట. అయితినాటి కీకలు యినిపిస్తాయేటి నోకానికి ? ఈ నోకంల దిక్కూ మొక్కూ లేనోల్లు - ఆకళ్ళుతొటి, జబ్బుల్తొటి సస్తున్నోల్లు దేవుడో అని కేకలేస్తూనేవున్నారు. ఇనిపిస్తున్నా యేటి యీ కీకలల్ల దేవుడికి ? అలాగే అయి పొనాది ఈ గుంటపాప కీకాను. ఏసచ్చినోడేవుడికీ యినపన్నేదు.

దీపాలెట్టేసినారు- పిల్లేటింకా ఇంటికి రానేదు, బాబోరే, నువ్వక్కపాలి ఏతోల్ల పెండికాసి ఎల్లుమీ - అని అప్పిడే సంతలెల్లి తిరిగొచ్చిన కొడుకున్తోల్నాట్ట గంగులుగాడు. ఆ యెనక మనసుండబట్టక వుష్ణంగున్నా ఎనాగో నెగిసి కఱ్ఱట్టుకొని సాయాంగ యీదిలోకొచ్చి నాడట, బిడ్డరేవుకాడ యేటి సికాకులు పడిపోతందో యేటో అని సనుక్కుంట. అయితాడింక నాలుగడుగు లెయ్యినేయెయ్యినేదట. సెడిపోయిన అమ్మోర్లాగ పారొస్తున్న కూతురు కల్లబడ్డాదట. నన్ను సంపీసినాన్రయ్య అని ఒక్కకీకేసి, అయ్య కాల్లకాడ, యీదిలోనే తిరాబడిపోనాదట.

ఏటయిపొనాదే తల్లి అని యీడు కూతుర్ని నెగదియ్యనానికి సూసినాడట. ఈ యేడుపు, కీకలు యినవడిగావాల, నలుగురూ నుట్టూజట్టయి, ఏటయిందంటేటయిందని అడిగినారట.ఏటయినాదంటే ఏటి సెప్పుతాదా గుంట? ఒయిసుకి సిన్నిదాయిగాని బుద్దికి ఏ పెద్దోల్లూ సాల్రట ఆ గుంట ముంగల. ఏ దెష్టనంజికొడుకు, తనకేటిసేసినాడో నోరిప్పి ఏనెక్కన సెప్పుకోగల్దు? దానికంతటి మానసార్కం, సిగ్గు-సీ, సెప్పుకోనేక పొనాదట, తనకే ఆపద జరిగి పొనాదో గుంట పాప.

“ పాంవూ, పురుగూ ఏటి కరిసినాదేటే ?” అనడిగినాదట ఓ ముసిల్దాయి.

“ ఔనేటో కరిసీసినాదే అమ్మమ్మ ” అన్సెప్పి గొల్లుమన్నాదట గుంట. అనాక్కాపొతే నా బతుకిని యీ పాంవు కరిసీసి నాదర్రోయి - అని నలుగురి ముందూ సెప్పి నలుగుర్లోనీ పలసనయి

పోనానికి తయారవుద్దేటి ? ఆ యెనక ఎవులెన్ని అడగతన్న ఏటీ సెప్పకంట నెగిసి నాలుగడుగులేసి ఇంట్లోకి జొరబడిపోనాదట. ఏడ్సేడ్సి సీరైపోతంది గాని ఇదిగిజ్జిరిగిందని సెప్పదు కూతురు. నోటమెతుకెట్టదు, ఒక సిటం తొంగోదు - నోరిప్పి మాట్లాడదు - బెల్లం మొత్తిన్రాయినాగ అనాగోకాడ గోడకి సేరబడిపోయి కూర్సోనుంటాది. జరిగిందేటో తెల్సుకొనానికి ఎన్నిబాదలు పడాలో అన్నీ పడ్డాడు గంగులుగాడు. కొసకి నాల్రోల్నాటిక్కావాల కసింత కసింత యిక్కడో ముక్క అక్కడో ముక్క సెప్పిందట. జరిగిందేటో యెరకైపోనా దీడికి. ఏసంగిలో అడువులకి అగ్గంటుకొని మంటలు నెగిసిపోతాయి సూసినారుగదా - ఆపెకారం నెగిసిపోనాది కోపం యీడికి. అయితె ఏటిసేస్తాడు, ఎవుడి మీసాన్ని పించీగల్డు యీడికోపం ? రాఁవులోరంతటోడు, సీతమ్మ తల్లిని రావనాసురుడు ఏత్తికెల్లిపోతే - గబీమనెల్లి ఏటేనసేసిగలిగినాడేటి ? అనాటప్పుడీ సాకల్నాకొడుకు - ఎవుడింటి మీదకెలిపోగల్డు కర్రొట్టుకొని ? నాయళ్ళ మీత్తి రాబడ్తే ఏటవుద్దోతెల్దేటి ఆడికి ? ఇంతకీ నాకూతురి కొంప తీసిన్నంజికొడుకివి నివ్వేన్ర అని ఏ నా కొడుకుమీదికి ఎల్తాడు ? అందరూ నక్కపోతు నాకొడుకులేగదా, అందల ఏ నంజికొడుక్కి సిచ్చెయ్యిగల్డు ? అందరూ వొయిస్సువులే బుట్టద్రొయ్యి లెగిరిపోనాయట. అందర్నాయుళ్ళు పెద్దమనుసులే - సీకటి పడకంటున్నంతసేపు. సీకటయినాక సూడాల - ఆల్లు ఎత్తీఅవుతారాలు. కూతుర్నడిగితే ఎవుడన్సెప్తాన్రా సీకట్ల నానాడ్ని సూసినానేటి ? అనిసినాది. సీతవెమ్మోరు, రావనాసురుడ్ని సూసినాదేటి? గంగులుగాడి కేఁవో లోపలమంటల్నెగిసిపోతున్నాయట. అయితే ఇదిగినా జరిగినాదని ఎవుడితో సెప్పకోగల్డు ? ఎవుడితో సేనా సెప్పుకుంటే కూతురు బతుకేటవుద్ది ? ఈ నెక్కన మింగనేక, కక్కనేక మనిసి దిగాలు బడిపోయి, పన్లో కెల్లకంట, అరుగుమీనే తొంగోయుండివోడట, సూరుదుక్కు సూస్త. అయితె మనం తొంగుంతే, కాలం తొంగుంతాదేటి ? పండుగ దగ్గిరబడిపోతుంది. పెదనాయుడు ఎర్రి గెంతులు గెంతెస్తన్నాడు- " ఏట్రా మరి మాబట్ట ముక్కలుతకవా" అని. ఏటన గల్డీడు ? వుతకనంటే, ఏలుతకవని అడగర్రా? బాబు, నామనుసు బాగునేదంటే ఏటంత కష్టింవొచ్చి పడిపోనాదని నచ్చన్నర పెసిల్సు. మన్పల్లిటూళ్ళ సంగతి మీకు తెల్దా ? ఎవుడ్నేన అడి బాదలాడుపడ్ని అని వొగ్గుతాఁవేటి ? పతివోడిగోల మనకే కావాల " ఆయాల రాతిరి నీయింటి ముంగలగోలేట్రా" అనడిగినోల్లకే జవాబుల్సెప్పనేక సచ్చినాడట. "కూతురికి పొట్టికర్సేసినాది అందికని ఏడ్సి గోలెత్తిసినాది " అని సెప్పుకొచ్చినాట్ట అడిగినోళ్ళకల్ల. (పొట్టి - మంద్రగబ్బ)

మరేసీతమ్మ తల్లి దాన్రూపుల పుట్టేసినాదో తెల్డుగానోరే- బోగికి తొలిరోజునాడు - అయ్యె అన్న , రేపుకాడున్న టఁయివు సూస్కొని వురెట్టుకొనిసచ్చి పొనాదట్రయిాగుంట - అంతటి మానసొరకఁవ్ర దానికి . ఇజ్జరిగినాక మరా మడకనుండనేక, తనవూసెవుడికీ తెలకంట వుండాలని గావాల సీఁవలవల్స ఎల్లిపోన్డట.

" సీఁవల వొల్సా ? ఎక్కడ రాజాంఁవు, ఎక్కడ సీఁవలవొల్స, ముప్పియ్ కోసులుంటాదిగావాల" అని సనిగినాడు సొట్టప్పియ్యగాడు.

కసింత తెరిపిచ్చింది వోన. మడియార్లు నలుగురూ పోగయి గంగులుకాడి కొడుకుని వొల్లకాటికి తీస్కెలిపోనానికి తయారవుతన్రు. గంగులుగాడు నెగిసెల్లి కొడుకు సెవం మీనబడిపోయి గొల్లుగొల్లుమని ఏడ్డమారంబించినాడు.

" అయ్యోరయ్య, నానేటి సేసినాన్రమీకు ? నా కడుపుల సిచ్చెట్టీసినారేట్ర మీరల్ల ? ఏ దేవుడి కేటన్నాయం సేసినాన్రనాను ? నాకేట్ర యీ సిచ్చులు ? బిడ్డల్నిచ్చి నాక్కుంటాడా ? నా ముద్దు తీరకంట నన్నేడిపిస్తాడా ? ఎక్కడ సచ్చినావురోరి దేవుడోర్దేవుడో, నన్నూ ఎత్తుకెలిపోరా ! పెల్లానెత్తికెల్లిపోనావు - నా బిడ్డల్నెత్తి కెల్లిపోనావు - నానేట్ర దెయ్యాఁవ్నాగ. నన్నూ ఎత్తి కెలిపోరోరి తండ్రో ! " అనిగోల గోల బెట్టెస్తండు.

ఆడిగోల సెవలబడీతప్పుటికి గబుక్కున మర్రిసెట్టు కాడ్నుండి నెగిసిపోన్ను నచ్చియ్యఁమావ. నెగిసెల్లి గంగులుగాడి రెక్కొట్టుకున్నాడు. నచ్చియ్య మాఁవన్సూసీ తప్పుటికి గంగులుగాడి దుక్కాఁవ్ మరీ ఎక్కువైనాది.

" ఓర్నిచ్చియ్య మాఁవ, ఈల్లకెపులికి తెల్దుర నా కడుపుల సిచ్చు, నీ కొక్కడికె తెల్సురయ్య, అయ్యోరయ్య, ఎయ్యిజనఁవలకీ నీకంబార్నయి పుడతాన్రయ్య - నన్నూ యీ సెర్లొతోసిమని సెప్పురా- యీ పెద్దోలకి నన్నాపొద్దని సెప్పురా - నా బిడ్డలల్ల ఎల్లిపోన్రు - మరి నానేట్రిక్కడ!"అని నచ్చియ్యిమాఁవ దుక్కుసూసి యెర్రోడ్లా ఏడ్డం మొదలెట్నాడు. నచ్చియ్యిమాఁవకల్లల్ల నీల్లు తిరిగిపోనాయి. ఆడ్ని ఓదార్చనానికెల్లి ఈడేడ్డం మొదలెట్నాడు. సివరికెనాగో, ఒకనాగ గంగులుగాడ్ని పక్కకి తప్పించి సెవాన్ని తీసికెలిపోన్రు మడియార్లు.

నలుగురైదుగురు కులఁవోల్లు గంగులుగాడ్ని నెగదీసి యింటికాసి నడిపించినారు. నచ్చియ్యిమాఁవ ఆడి సెయ్యోట్టుకొని యింటిదాక నడిపొచ్చినాడు. ఇది సూసినోల్లల్ల ముక్కుమీన ఏలేస్కొని, "ఈ ముసలోడు నచ్చియ్యమాఁవేటి యియ్యాల బొత్తిగ డీలాఅయిపోన్డు ! ఎవడికేన యీగమీద వొలితప్పటికి - గంటన్నర యేదాంతం సెప్పుకొచ్చేవోడు. అనాటి దియ్యాల వులు కూపలుకూ నేకంట గంగులుగాడెనక నడస్తండు" అని కబ్బయిపోన్రు జనఁవల్ల.

నచ్చియ్యిమాఁవ అంబల్త పేలాముందు కూకున్నోడు, కూకున్నట్టే నెగిసిపోన్ను అంబలినోటికెల్లక. కసిన్ని నీల్లు పుక్కిలించీసి, సింకి గాఁవంచాతో మూత్తుడుసుకుంటూ ఆంజనేయులి గుడికాడకి సారొచ్చినాడు. ఒక్కసిటం తొంగోనానికి సూసినాడు. కానయితే కంటిక్కునుకోస్తేన ? నెగిసి కూకున్నాడు. సెర్లొపడిపోయిన గంగులుగాడి కొడుకుయాదస్తుకొచ్చి కంట తడెట్టుకున్నాడు.

వోన పడతందేఁవో, సొట్టప్పియ్య గాడికియ్యాల దూటినేదు. నర్సునాయిడి బక్కల్ని మేపుకి తీసికెల్లకంట, యింటికాడే వుండిపోన్ను వోన దరఁవాలని. అయితింటికాడ ఏటిసుకం అడ్లాటోడికి? అందికని ఆడూ ఓ సుట్టు తొంగోవాలని గుడికాడికే పారొచ్చినాడు. వొచ్చినాడుగాని,యిసారంగా కూకోయున్న నచ్చియ్యమాఁవ దుక్కుసూసీతప్పటికి ఆడికి మరి తొంగోవాలనిపించినేదు. కసింతసేపు పల్లకున్కాకోని, నచ్చియ్యమాఁవని కదిపిసూసినాడు.

" అయితొరెదద్ద ఇంత తెలిసినోడివి, ముదరోడివి, నువ్వేట్ర యినాగైపోతన్నావ్ యిసారంతో? ఒకటి సత్తిఁవు. కన్నుమూసీతప్పటికీ ఆ గుంటడే యాదస్తాస్తన్నాడు- ఏఁవందంగుండీవోడ్ర - ఆడగంట్లందరికీ ఆడి మీదేకద దుస్టి. అలాటోడియాల సెర్లొబడి సచ్చిపోన్డంటే అడ్నిబాగయెరిగున్నోల్లం, మనకేనా గొస్తాదేటి కంటిక్కుమకు ?"

" ఒర్సొట్టప్పిగా, యీ సచ్చినోడొక్కడికే ననుకుంటన్నవేటి రాసకుఁవారుడ్నాటిరూపు? గంగులుగాడు సెప్పీవోడుకదా - ఆడిపిల్లలల్లా బంగారబ్బొమ్మల్నాగే వుండీవోరట ఆడికూతురు వురెట్టుకోని సచ్చిపోనాదని సెప్పినానుగదా - అది సచ్చిపోయిన్నాడట వూరు వూరల్లా కల్ల నీలెట్టుకొని అనుకున్నారట - " మరినాటి అందఁవైనబొట్టె బూమ్మీద పుట్టదు " అని. సచ్చినోడి కల్లు సేరడేసి అని మనోల్లంటుంటారు సూడుమీ - అదీడికాడ నిజఁవై పోనాదిరా. రాసకుమారుడ్నాటి గుంటడిలా సెరువుపాలైపోన్ను. లచ్చిందేవి నాటి కూతురు సెతకారీ నాకొడుకులు సేసిన పనికి బలైపోనాది. మరీడి సిన్నకొడుకంట సిసింద్రీ సిచ్చుబుడ్డినాగుండీవోడట. సాకలోడి కొడుకయితేనేంగాక పంగనావాఁలెట్టుకున్న పంతులేనా సేతుల్లోకెత్తుకోని ముద్దాడీవోడట. అనాటి గుంటడ్నిగూడా బలిసిపోయిన ఆంబోతులు నేగపెయ్యిని కుమ్మేసినట్టు డబ్బుతోటి వూటెక్కిపోయి, మంచీసెడ్డా మర్సిపోయిన్నా కొడుకులే కుమ్మేసి సంపేసినారట్ర. సీ, సీ దేవుడనీవోడున్నాడేటి ఎక్కడేన! రమ్మన్నాకొడుకుని - రమ్మన్నియాళ నా ముందికి - నీల్డీసి అడిగేస్తను. "ఏట్రయ్య, మనుసుల్లోమానిక్కేల్నాటోల్ని పుట్టించి, ఆయెనకకుక్కల్ని, నక్కలి సంపేసినట్టు సంపేస్తన్నవ్ గదా, మరినివ్వేనాటి దేవుడివిరా" అని. సొట్టప్పియ్యోరే, పోనాయిరానాకు బెవలు. వూరాగ సచ్చేటైంవుకి తెలిసొచ్చిందిర యీ సత్తిఁవు. దేవుడు నేడు దెయ్యిఁవూనేదు, నాయఁవూనేదు; అయన్నీవున్నా యనుకోడం మనబెఁవ! డబ్బు కలిగినోడెవుడేనుంటే ఆడే దేఁవుడు. ఆడేటిసెస్తే అదేనాయిఁవ్, మన్నాటినాదార్నా కొడుకులిఁవి లేఁవా, మనపుటకే పాపఁవ్, మనవేటిసేస్తే అదల్లా పాపఁవే. పేదోడి బతుకు కుక్క, నక్క బతుకుల్తోటి సఁవానఁవని నెక్కేస్కో. మనసావులు, మన అవస్తలు - ఎవుడిక్కావాల్రా?

నచ్చియ్యమాఁవా దుక్కఁవ్‌తో కిరకిర్లాడిపోన్ను. దగ్గుపారొచ్చింది. దగ్గి దగ్గి ఆయాసపడిపోన్ను.

అడ్డిసూస్తప్పటికి మరేటి అడగబుద్దెయ్యేదు సొట్టప్పియ్యకి. పొగా మడతలెల్లి కసింత పుఁవాకు పాయితీసి, నోట్లేసి, కసిపిసనఁవిల్నాడు. వోన అక్కంట పడిపోతంది. ఏటిసెయ్యానికీ తోసకటుంది సొట్టప్పియ్యకి. నచ్చియ్యి మాఁవదుక్కు సూసినాడు యిసారంగా, కొండనాటి మనిసి నచ్చియ్యిమాఁవ వూరంతటికీ దరఁవం సెప్పి, వోదార్సీవోడు. అనాటి ముసిలోడియాల ఆడే నీరుగారిపోయి యేడస్తుంటే, పూటకి టికానాలేని నాలాటోడి మాటేటి అనుకున్నాడు సొట్టప్పియ్య. పెపంచికానికే దుక్కఁవ్ ముంచికెలిపొచ్చినట్టు వోన కురిస్తేస్తందవతల. షింకితువాలు గుడ్డ కసింత సద్దుకున్నా డప్పియ్య, సిన్నసలేసినట్టనిపించి. ఈ సలీ, వోన - ఈటిమీద్దుష్టే లేనట్టున్నాది నచ్చియ్యిమాఁవకి - ఎటుదుక్కో చూస్తున్నాడు పరాగ్గ. కొసకి వుండబట్నేక సొట్టప్పియ్య అడిగేసినాడు. " నచ్చియ్యిదద్దా, మరయితే గంగులిగాడి సిన్నకొడుకేటొచ్చి పోనాడ్రా? అని.

"ఏటొచ్చి పోన్డా? ఆడుసచ్చిపోన్డని ఎవుడన్నాడు? ఆడ్ని సంపేసినార్రా - సంపేసినారు - ఆ సీవఁలవొల్స నాకొడుకులు; నారాయినపురంకాడ డేవు కట్టీడఁవ్ కాదుగానొరే - యీ నాకొడుకులల్లా సెరుకేసేసి అయిస్పంవచ్చురాల్తిరక్కంట నచ్చాదికార్లయిపోయి, డబ్బుతో పులిసిపోయి, టెంపర్లతో బలిసిపోన్రు గదా, ఆల్ల కెవుల్లకేన కల్లు కనపడతన్నాయేటి?"

" పెద్దింటోల్లే - ఆల్ల పేర్లన్ని మనకిప్పుడేల-ఆల్లింటికోనాడు పెందిలేళ గుంటడ్నితో లేడట ముదరోడు- అంటే గంగులుగాడు, ఆడికి తీరక. " పెదనాయుడిబాబు కఁవీజులు యిస్త్రీసేసినవి యిచ్చీసి పొర్రారా నాయినా"అని. ఈడు ఆ కఁవీజులు తోల్డం రెండు గంటలు అలీసం అయిపోనాదట. సారా తాక్కాకున్నాడోయేటో - ఆ పెదనాయుడి తమ్ముడు యీ గుంటడి మీసూపించినాట్ట కోపంవల్ల.

" ఏఁడ్రా గుంటనంజికొడుకా, మీయయ్య - ఆడుగాని యియ్యాల నా కంటబడితే సంపీసుండీవోడ్ని. కన్కాని, మరి కనపడకంట ఎందల దాంకుంటాడో నాను సూడ్నేటి?పెయాణం సెడగొట్టేసి, తన్నులు కాయకంట తప్పుకోనానికి నిన్ను తోల్తాడ్రా నంజికొడుకు? " అని ఎఁర్రెత్తిపోయి గభీమని గుంటడిమీదిక్కాలిసిర్నాట్ట. ఆకాలెల్లి ఈ గుంటడికి తగలకూడన్సోట తగిలిపోనాదట. మరేటున్నాది, టపీమన్తిరా బడిపోయి, టక్కున పేనాలొగ్గేసినాట్ట. గుంటడిదెంత పేనం చెప్పు?కోళ్ళు,గొఁర్రెలు తిని తిని బలిసున్న గాడిదికొడుకు తంతె,కాస్కోగల్డేడి సంటిగుంటడు?"

అయితే యింతగోరం జరిగిపోనాదికదా, ఆనాయిడేఁవేన జంకినాడంటావా? గుంటడిపేనం పోతే ఆడికోనెక్కా? నల్లి సచ్చినట్టో, దోఁవ సచ్చినట్టో అనిపిచ్చుంటాదిగావాల ఆడికి! కంబారోడ్ని తోలి అరిజెంటుగా గంగులుగాడ్ని రప్పించినాట్ట. రప్పించి " ఒట్టిగెలిపోరా" అని గుంటడి పీనుగుని సూపించినాట్ట. సెందమాఁవనాటికొడుకు గడిసేపు ముంగల్దాక నవ్వుకోని, గెంతుకోని బతికిన కొడుకు

సచ్చిపడుకున్నాడు. ఏటని సెప్పగలం, ఆడు అనుబగించిన బాద? కొడుకు సెవమ్మెనపడిపోయి ఎర్రిగోలెట్టీసినాడట. ఇసిత్రం సూసినావా, కొడుకుసచ్చి ఆడేడస్తుంటే 'అయ్యో పోనీ' అనేననకంట, యేటి సెలవిచ్చినాట్టిరికా సెదనాయుడు? "ఒరే నంజికొడుకా, యిక్కడా యేడుపులు, మొర్రలు సేసినావంటే, నిన్నూ సంపీగల్ను సూస్కో - ఆడి సెవాన్ని నీ యింటి కొట్టికెలిపోయి ఎంత లెక్కని ఏడ్చుకుంటావో యేడ్చుకో," అన్సెప్పినాట్ట - అంతేగాని, తెలిసో, తెలకో తమ్ముడు బుద్ధితక్కూవని సేసినాడని, ఆ తమ్ముడికి నాలుగు దొబ్బులెట్నాడా? నేదే? కొడుకుసచ్చి ఏడస్తన్నందుకు యీ గంగులుగాడికే సీవాట్లు. సచ్చిపోయిన కొడుకుదుక్కు సూసి ఏడ్డానికి క్కూడా ఆడికిసొగంత్రం నేదు.

"బాబూ పేనాల్తీసినారుగదా - ఆసేతుల్తోటే తగలబెట్టేసి బుగ్గిసేయించీండి. అప్పుడ్డాను సచ్చినోడి అయ్యనని సెప్పుకొని ఏడ్వక్కర్నేదు" అన్నాట్ట యిసిగిపోయి. ఈ మాటలింతానే పెదనాయుడు కన్నింత గుడ్డింతసేసి "నోరుమూసి తిన్నగ ఆడ్ని యింటికొట్టికెళ్ళాల్రా - నేకపోతే ఒట్టికెల్లి లైనుమీద పడింటీమంటావా?" అనడిగినాట్ట. ఆనాకొడుకు, ఆడుమడిసో, మానో తెలకంటున్నాది. నేతగ, రాసబిడ్డనా గుండీవోడు. ఆడ్ని తన్ననానికి కాలెలాగొచ్చిందోఁఆడికి అని తల్సుకొన్తల్సుకొని కుఁవిలిపొతుండొడ్ర యీ గంగులుగాడు. ఆ నాయుళ్ళు ఎనాటి కసాయినాకొడుకులో సూసేవా, గుంటడ్ని సంపీసినందుకు సీవ కుట్టినట్టేన బాద పడ్నేదు సరిగదా - సెవాన్ని నోరుమూస్కోని నాట్టికొల్లకపోతే - రైల్లయిను మీద పడంచీసి, ఏ బండికిందో పడీపొన్డని అనిపించేస్తాట. అంతపనీ సెయ్యిగల్రాల్లు, ఆల్లకేటి? అరిష్టం నాకొడుకులు. ఆల్లముందీ సొకలోడు పుప్పొపత్తిరా? నోరు మూస్కోని కొడుకుని మట్టిసేసేసి, ఆ దురమారగం నా కొడుకులు మద్దిన మరుండనేక - ఈ వూరు పొరొచ్చినాడు. ఇక్కడి కొస్తే, యీ గుంటడు సేసిన వోగాయుత్తెంపనియిది. ఇయ్యాలతో ఆడింట్ల దీసఁవన్నదినేకంట ఆరిపోనాది. మరేట్ర ఆ గంగులుగాడు బతికుండాల?"

ఆడిపేనం యెంత సాలొచ్చిందో ఏటో,నచ్చియ్యి మాఁవ మరోపాలి కల్లొత్తుకున్నాడు.

ఓ సిటం ఆగి- 'అవున్రదద్దా, యీ గుంటడికేటి సెనిపట్టింద్రా, సెర్లోపడిపోన్డు' అన్నాడు సొట్టప్పగాడు.

"అప్పియ్యా, పెందిల సెరూగట్టుకాడ నివ్వులేవా? వున్నావా? అయితా బగాదిగాడి పేలాపనాలకించినావు గదా! ఆడేటి తేల్సినాడో సూసినావా - సిన్నిగాడు సెరులో పడిపోనానికినాను కారనఁవని! అప్పిగా - ఆడు సెప్పింది నిజీవో, అబద్దఁవో ఆ బగఁవంతుడన్నోడొకడుంటే, ఆడికి తెలాల. ఒకటి సత్తిఁవ్ రా - ఈ సిన్నిగాడు పెద్దోళ్ళ గుంటల్తకూడి సెడిపోతన్డని కేకలేసినాను. అప్పిగా నివ్వేసెప్మే. కర్ణంగాడి బామ్మర్ది, నర్సునాయుడికొడుకు - ఆల్లు పేకాటాడితేనేటి,

తాగిముండలకెల్తేటి, ఆల్లకేటి నష్టఁవా? అస్సలు, ఆ గాడిదికొడుకుల్కి ఇంతకంటె పనేఁటా? ఆల్లబక్కల్ని నివ్వు కాస్తావు. ఆల్ల పొలాన్ని కంబార్లు దున్తారు. కల్లాలలకనానికి పిడకల్సెయ్యినానికి సూర్నంజున్నాది - పండిన పంటలల్ల కల్లంయేపించి నూర్పించి, గింజలు గాదిల్ల కొట్లల్లయెయ్యినానికి కూలోల్లున్నారు, యీ పనుల్లతిరకాసురాకంట సూపొ్కనానికి నాకిన్ని కూలిగింజలిచ్చి కూకోబెడతన్నారు. పట్నఁవ్ లెల్లి సావుకార్లొచ్చి యీల్లకొట్లల్ల ముక్కిపోతన్న గింజల్ని కాటాయేసి, బస్తాలుకట్టి పట్నఁవొట్టికెలిపోతారు. ఆ సావుకార్లు పారేసిన డబ్బుని నెక్కెట్టి, జాకర్తగా యినప్పెట్టిల్ల యెడతారు నర్సనాయిల్లు,రాఁవినాయిల్లు. అదిరా - యీల్లుపడేశఁవ. ఈల్లొక్కనాడంటే ఒక్కనాడు-ఒక్కసిటం కష్టపడ్డఁవ్గాని, యిక్కడ సీపురు పుల్లతీసి అక్కడెయ్యిడఁవ్గాని సేసినారా? గొడుక్కప్పుకోని, సుట్ట కాలుసుకుంటు, ఒక్కసారి పొలం గట్లంట నిలబడ్తారు. - అంతే, నివ్వూ, నాను, గోసీగుడ్డలెట్టుకొని యీపులు కాలిపోతుంటే, నెత్తులు మాడిపోతుంటే, తాగిన బుక్కెడు గెంజినీల్లు సాలక కడుపు గోలెట్టిస్తుంటే, బతకనానికి యింతకంటె మరో అదరవుదొరక్క, సచ్చినట్టు యీల్ల పొలాలంటె పన్జేస్తాం. గట్టుమీన్నిలబడ్నోడేఁవో తిన్నదరక్క - కురిసీలోదొర్లి, పేకాటాడి, కంటపడ్డ ఆడకూతుర్నల్లపక్కలో కొట్టికెలిపోవాలనిసూసి - నానా బాదలు పడతన్నాడు. కల్లునెత్తికెక్కిపోయి కూకున్న అనాటోల్లతోటి, మన్లాటోల్లు జట్టుకడితే, ఎవుడికిరానష్టఁవ్? పుల్తోటి మేక తిరిగితె - ఎవులికి నష్టఁవ్? ఆడుపేకాటాడి నాలుగొందలోడిపోయినా, ఆడికేటి నష్టఁవ్? ఆడు ఆడతన్నాడని ఆడితో పోటిగా నివ్వు నేను ఆడగలఁవా? యీ పూటగడిస్తె రెండోపూట గడదు మనకి. రోగఁవ్ రానీ, కష్టఁవ్ రానీ, కూలికెల్తేనే బత్తెఁవ్ ఒడ్డెక్కుతాది మన్లాటోల్లకి. ఒక్కపూట పనికెల్లకంట కూకుంటే పొయ్యికాడ పిల్లి నెగదు. ఇదిగీ మాట్లే నాన్సెప్పి నాఁనా ఆ గంగులుగాడి కొడుకుతో - కానుకోరా నివ్వెవుడివో అని. అయినా ఆడు యినిపించుకోనేదు. సరి యీడికి బుద్ది యినాగ రాదు అని ఆడయ్యి గంగులుగాడితో సెప్పినాను - " ఒరయ్యి, యిదిగినాగరా నీకొడుకు కర్ణంబామ్మర్దుల్తోటి, నర్సునాయుడు కొడుకులతోటి జట్టుకడతన్డు - యియ్యాల పేకముక్కలు, రేపు సారాకొట్టు, ఆ యెనకింకేటో - కొడుకుని అదుపుసేస్కోరా, అసలే దెబ్బల్తినీ సున్నోడివి" అని. అంతమట్టుకి సత్తెఁవు.

నా మాటలినీతప్పటికి, ఎఱ్ఱికోపం పారొచ్చిందాడికి. ఆడ్నది సేస్తాను యిదిసేస్తాను, ఆత్తూత్తని కేకలెయ్యిటం మొదలెట్నాడు. అప్పుడ్నానే ఆడికి బోదపర్సినాను- " గంగులోరే, నివ్వుతిన్న దెబ్బలు ఆడికేటి తెలుస్తాయి! నువ్వుత్తిగె ఎఱ్ఱెత్తిపోకురా! ఆడింక గుంటడు - పాలేటో నీలేటో తెల్నివాయిసాడిదింక. అనాటోడ్నట్టుకొని, నాలుగుతికీసినావంటే, ఆడూ నీ సెయ్యి దాటిపోగల్డు. అందుకని మెల్లిగ ఆడికిబోదపర్సి దోవనోకితెచ్చుకోరా" అన్సెప్పినాను. నాదిసెన్నోఁరా! " ఆడు నీ సెయ్యిదాటిపోగల్డు" ని నా నేలనాల! నోట్ల ఏ సెనీ నేకపోతే, అంతపనెందుకయిపోద్దియాల? సీ,సీ,

ఎదవబతుకు - నాను మిగిలిపోన్ను యినాటిగోరాలన్ని సూస్తుండ్డానికి, వొజ్జిరంనాటి గుంటడు సచ్చిపోన్ను".

మల్లి మరోపాలి కల్లు తుడుసుకున్నాడు నచ్చియ్యి మావ. వోన ఒక్కరవ్వ తగ్గింది. సొట్టప్పిగాడు నెగిసిపోన్ను, కంబారి నౌకిరిసేస్కొని బతుకుతున్నోడు. కతలిన్కొని కూకుంటానంటే నర్సునాయుడొప్పుతాడా?

" నానలాగోపాలిపొలందుక్కెల్లొస్తా(నచ్చియ్యిదద్ద! సినుకుల్తగ్గినాయికదా, నాలుగ్గడ్డికర్లు తేవాల గేదకి, నేకపోతే నర్సునాయుడు సివాలేస్తాడు" అనీసి, కత్తవ,తట్ట వొట్టుకొని పొలందుక్కు ఎల్లిపోన్ను సొట్టప్పియ్యగాడు.

పొలంకాసెల్లి తప్పుటికి బగాదిగాడు తారసపడ్డాడు. సేతికందొచ్చిన పంట బుర్దపాలైపోద్ది కావో(ల బగవొంతుడా అని పుట్టెడు బెంగతో కుఁవిలిపోతన్నాడాడు - సేతలపారతో, రోజురోజుల్లా పొలఁవ్‌లేవున్నాడు, గట్లుతెగొట్టుకోని. అయితే రేతిరికాడ్నుండి, మీదలెల్లి కురిసేస్తందిగదా గంగ,దాన్నెవుడాపగల్డు? ఈ వోనకితోడు, ఆడినేస్తం సిన్నిగాడు యియాల సెర్లొబడి సచ్చిపోన్ను. అందుకనీగావాల - బగాదిగాడికియాల మడుసుల మద్దినిరగాలనిపించకంటుంది. అంబల్తినాలనికూడా అనిపించకంటుంది. ఆకలేస్తంది - అయినాతిండికెల్లానికి మనసొప్పకంటుంది. ఇటుదిక్కుసూస్తే, గాలికీ, వోనకీ వొరిసేను తిరాబడిపోయున్నాది. ఎన్నులు బురదలో నానిపోతన్నాయి. ఎటుదుక్కుసూసినా ఏడుపే పారొస్తంది. ఏడ్నేక, వూరుకోనేక అనాగ కూకుండిపోన్ను గట్టుమీద బురదనేనసూడకంట.

ఆడ్నలా సూత్తప్పటికి సొట్టప్పిగాడికి నర్సునాయుడు తనకిచ్చిన గేదిపడ్డ యాదస్తుకొచ్చింది. తొ(లోజుల్లొ సచ్చీ సజ్జులో అ పడ్డకూడ యినాగే వుండీది బుర్దల్తొంగొని. అనాటి గేదిపడ్డని నానాబాదలుపడి పెంచి, గేదిన్సేస్తే, గేదయి, పాలిచ్చీతప్పటికి నర్సునాయుడు ఒట్టికెలిపోన్ను, సొమ్మొకడ్దిసోకొగడిది. గేది ఇప్పుడు తనకాడ్నేకపోయినా, దానికి పచ్చి గడ్డిపరకలు మాతరం తనే వొట్టికెల్లాల నర్సునాయుడి కొలువులో వున్నందుకు. ఎనాటిపని ఆడుపురమాయించినా సెయ్యివలిసిందేగదా! ఆడి గేదిగ్గడిపరకలేనా తేవాల, ఆడి పెల్లానిక్కొకలేనా వుతకాల.

సొట్టప్పిగాడు బురదగట్లంట జాకర్తగ నడ్సుకోని, బగాదిగాడు కూకున్న కాడికొచ్చేడు. "తమ్ముడొరే బగాది, ఏ(టలా కూకుండిపోనావు బుర్దల" అనడిగినాడు.

ఆడియ్యాల ఏలింత యిసారంగున్నాడొ తెలకపోనేదు సొట్టప్పయ్యకి. బగాదిగాడికి, సచ్చిపోయిన సిన్నిగాడికీ యితంతనీ సెప్పనానికిల్లేనినేస్తం. మరనాటి నేస్తుడు సచ్చిపోతే ఎనాటోడికేన మనసుపాడయిపొద్ది. ఈదుక్కఁవ్ సొల్నట్టు వోనొకటిసంపేస్తంది. నోటికాడికి రావల్సినకూడుని

బుర్దపాలు సేసేస్తంది. రయితన్నోడికి యింతకంటె పెద్దకష్టెవ్ మరేటేనుంటాదేటి?

తట్ట, కత్తవ కిందబడేసి, ఆ బుర్దలోనే సొట్టప్పియ్య కూడా సతికిలబడ్డాడు. బగాదిగాడిపక్కన సతికిలబడి, "తమ్ముడోరే అంత మంచి గుంటడు- ఆడేల సచ్చిపానాడ్రా సెర్లగొంతిసి? నివ్వుసూస్తే నచ్చియ్యదద్దే యాడిసావుక్కారనఁవని నలుగురి ముంగల అనీసినావు. ఆ ముసిలోడు నీ మాటల్తల్సుకొని, తల్సుకొని ఆంజినేయులు గుడికాడ కుఁవిలిపోతన్నాడు. పెద్దోడ్ని అంతమాట అనీసినావంటే నీకెంత సాలొచ్చిందో ఏటో" అన్నాడు.

"ఆదికాదు రప్పిగ, నివ్వే సెప్మేనాయిఁవు- నానూ సిన్నిగాడు మొకాల్బాసుకున్న టైఁవెనాటిదో తెల్దుగాని - మా బొందిలేరన్నమాటగాని, మాపేనాలొకిట్నాగ బతికినాం. అలాంటోడు సచ్చిపానాక - ఈ నోకఁవల్ల సీకటయిపానట్టుగున్నదిరా నాకు. ఎటుసూసినా, నా కాడే కనిపిస్తున్నాడు. నిజఁవ్ రప్పియ్య, నన్నూ ఆడు పాఁరాఁరా అని పిలస్తన్నట్టనిపిస్తందిరా! ఆడిసావుక్కార్నం ఆ ముసిల్నాకొడుకు నచ్చియ్య గోడేఁన" అన్నాడు బగాది. అప్పియ్యిచ్చిన పువాకు కసింతఁవిలి సెప్పికొచ్చినాడు. "నాన్నిన్న పెందిల సల్లన్నం తినీసినాక, సిన్నిగాడికోసం ఆడింటికెల్లినాఁన. ఆడింటికాడ లేడు నానెల్లీతప్పుటికి. గంగులుగాడు ఇస్త్రీ పాఁవుతున్నాడు. ఆడిముంగల కూకోయున్నాడు యీముసిలోడు. "సెరువుకాసెళ్ళినాడు మరో సిటంల పారొస్తాడు కూకోరా" అని గంగులుగాడంటే, నాను కూడ యీముసిలోడి పక్కనే సతికలపడ్డాను. ఈ ముసిలోడు గంగులుగాడికేటి బోదపరస్తండెరికా? "ఒరయ్య గంగులూ - నివ్వుసూస్తే దెబ్బమీద్దెబ్బ తినీసున్నోడివి. ఈ గుంటడుసూస్తే నీ కన్నాయం సేసీపోడ్నా అగుపిస్తండు. నేకపోతే నాకు తెలకడుగుతాను - ఆడికి నర్సునాయిడికొడుకుతోనీ, కర్ణం బామ్మర్దితోనీ పేకముక్కలాటలూ, దోస్తీలూఏట్రా? ఈ పెద్దిల్లోల్ల యెలాటొల్లనుకున్నావేటి? తోడేల్నా కొడుకుల్రా. ఈల్లంత మన్నాటి అనాదోల్లని సప్పరించీనానికి కాసుక్కూకున్నోల్రా. అనాటోల్ల సేతలపడకంటనీకొడుకుని ఏపెకారంగ కాస్కుంటావో, సూస్కోరా" అని సెప్పినాడు. నావూసూ ఎత్తునేటో కాని నాను పక్కనే కూకున్నానుకదా, అందుకని నామీదేటీ సెప్పనేదు.

ఆడి మాటలు ఎక్కడికి దార్తీసినాయెరికా? గంగులుగాడు యిస్త్రీ పెట్టొగ్గీసి, యెర్రిపీర్నాగ నెగిసినాడు.

"సీ, సెతకార్నాకొడుకు, యింటికిరానీ సెప్తానాడిపని, అలా సంపెస్తా నిలాసంపెస్తాను" అని బెమ్మరాచ్చుసుద్నాగ కీకలెయ్యిడం మొదలెట్టినాడనుకో. ఆడీ యితంగ నర్సింవావుతోరం ఎత్తినాడా- ఆడికి దూపంయేసినట్టు యీ ముసిలోడేటన్నాడెరికా?

"ఒరయ్య గంగులు. నీ కొడుకిప్పుడేటి సిన్నోడా, సితకోడ్రా? ఆడికి మెల్లిక బోదపర్సిదోవనోకి తెచ్చుకోవాలగాని, అది సేస్తానిది సేస్తానని అడ్డీ బెదరగొట్టెస్తె ఆ యెనక ఆడేటేనయితే, నీకు

దిక్కేట్రా!" అనీసి సల్లగ యింటికెలిపోన్డు.

కోపంమీద పల్లుపటపటఁవకొరకతన్నాడు గంగులుగాడు. ఆడ్ని సూస్తున్నప్పటికి నాకే బయ్యఁవేసింది. నా నక్కడ్నుండి నెగిసిపోయి సెట్టురాఁవులు సాల్లోకెల్లి కూకున్నాను. నానేల అక్కడ నక్కినానెరికా? ఏఁవో యీ గంగులుగాడుసూస్తే, నర్సింహ్వావుతోరంల వున్నాడు. కొడుగ్గాని కల్లబడితే, నిజింగా సంపేస్తాడో యేటో అనిజడ్సి ఆ సాలకాడకూకున్నాను. నానెక్కేటి, సిన్నిగాడుగాని సెరువుదుక్కు నుండి యింటికాసొస్తె, సెట్టురాఁవులు సాలముంగల్లెల్లే ఎల్లాల. ఆడ్ని లాక్కెలిపోవాలని నా బాద. అయితె ఆడినెత్తిన సెనుంటే, మనఁవేటి సెయ్యిగలం? ఆడుసెర్వుదుక్కెల్లనేదు. నర్సునాయుడి కొడుక్కాడికెల్లేడు. ఆడ్నిసూసొచ్చి, సెరట్లెల్లి యింట్లోకి దూరినాడు.

ఆడ్ని సూస్తానే, పెద్దపుల్నాగ కీకేసినాడు గంగులుగాడు "ఎక్కడ్నుండొస్తున్నావురా" అని.

తన వల్లేటేన పొరపాటు జరిగిపోనాది కావాలని గుంటడు బెగిలిపోన్డు. బెగిలిపోయి, "ఏటేనయిందేట్రయ్యా? నాన్నర్సునాయుడింటి కాడ్నుండొస్తన్ను" అన్నాడు. ఆడికేటెరిక యింటికాడ జరిగిన బాగోతం?

ఆ గుంటడి మాటిన్నాడో నేదో, ఆంబోతునాగరంకెలేస్తు, పెణకలెల్లి కావిడిబద్దని సఁర్రున్నాగినాడు. సఁర్రున్లాగి బాదినాఁడ్ర సిన్నిగాడ్ని, గొడ్నిబాదినట్టు బాదినాడు. నాను పరిగెత్తికెల్లి, ఆడి సేతనున్న కావిడిబద్దని గుంజి నాగీసినాను. అయితప్పుటికే సిన్నిగాడికి మోపైనెబ్బల్తగిలిపోనాయి కావాల - ఆడోమూల తిరాబడిపోయి, కుఁవిలి ఏడస్తుండు.

నాను కావిడిబద్ద గుంజేసి నాగీసినానుకదా - ఆడింకా కాలిసిరీ, సెయ్యిసిరీ కొడుకున్తన్నాలని వురకతన్నాడు ముందుకి. నాను దయిరం సేసి,

" ఆడుసేసిన పాపవేట్రా? ఆ ముసిలోడు నచ్చియ్యిగాడి మాట్లిని, మంచీ సెడ్డానేకంట యీడ్ని బాదీడఁవేనేట్రా? ఆడుసేసిన్తప్పేటోసెప్పి, కావాలంటే సంపీరాడ్ని. సెప్పరా - పెద్దోల్లయీది, సిన్నోలయీది - నేస్తంసేసినంతమాతారానికే మనుసుల్ని కొట్టి సంపీయాల? నేస్తంసెయ్యిడం అంత సెద్దతప్పేటి?" అనడిగినాను.

నా మాటనీతప్పటికి గంగులుగాడెనాగైపోన్డెరికా? ఏసంగిలో, రాతిరి ట్రైఁవుల్ల గడ్డికొంపలుంటుకోగానె, సూడుఁవీ, జనఁవల్ల గజ గజవొనికి పోతారు. ఆదిగా సెకారంగ వొణికిపోండ్ర గంగులుగాడు. గింజాకున్నాడు, గింజాకున్నాడు. కొసకి - ఎఁర్రికేకలేసి అంటాడుగదా,

"ఏట్రా గుంటనంజికొడుకా, ఈడు తప్పుసెయ్యినేదంటావా? ఈడు సేసిందనాటినాటితప్పురా? సిన్నతప్పు, సితక తప్పు అయితే నానీడు వొంటిమీద సెయ్యేస్తాన్రా? నాకు మిగిల్నోడీడొక్కడేఁన్ర! ఒక్క కొడుకు నెట్టుకొని ఆడ్ని కొట్టనానికి దిగినానంటే, నాబాదేటో ఆలోసించినావురా? వోరే, వోరే

బగాదిగ, సంపనానికి సెయ్యిరాక కోట్టినావ్రా!" అని, కొడుకు పక్కతిరిగి,

'సీ నంజికొడుకా! ఏ్రల నీబతుకు, నివ్వెవుళితో నేస్తంకడతన్నావో కసింత ఆలోసించినావురా! నివ్వు యీ బగాదిగాడికాడికో, మరేకరువుగొట్టు నా కొడుక్కాడికో యెల్లి కావాలంటే తాగి తందనాలాడ్రా! నివ్వు నాకు పెద్దోడివిరా ! మిగిల్నోడివి నివ్వొక్కడివిరా! మనకెవులెవులు ఏనాటెనాటి దెబ్బలు కొట్టినారో మర్సిపోనావురా? నీ సెల్లిని ఏనంజికొడుకులు సెడగొట్టొగ్గేసినారో, అదేల వురి పోస్కోని సచ్చిపోనాదో నీకేదస్తులేదురా! రాసబిడ్డనాటి నీతమ్ముడ్ని ఏనాకొడుకులు తన్నేసి సంపేసినారో మర్సిపోనావురా? నీ కొంపకగ్గెట్టేసిన తొత్తుకొడుకులకాడికెల్లి ఆల్లతో లాలూసీ అయిపోతావురా? సీ నంజికొడుక, నీ బతుకేల్ర! ఈ నర్సునాయిళ్ళు, కర్ణంబామ్మర్దులు ఈళ్ళెవుళ్ళో నీకు తెల్దురా? నీ కుటంవాన్ని దుంపనాసినంసేసినోల్లు యీల్లేన్ర. వున్న కాడుండనేక వూరూరు తిరిగినాంవే ఆల్లు పెట్టిన ఆవస్తలు పడ్నేక - అప్పిడె మర్సిపోనావుర? ఇది మరోవూరు, ఈలపేర్లు కొత్తపేర్లు - అయితేటి? మన్నాటి నాదారోల్లని సంపుకుతిన్నానికి పుట్టినోల్లేన్ర ఈల్లల్ల. అనాటోల్ల పంచని సేరతన్నావుర కంతిర్నంజికొడక. ఇనుకోరారే, ఆల్తోటి తిరిగి ఎప్పుటికేన నివ్వే సెడాలగాని ఆల్లకేటీ నష్టంవ్ రాదుర! పోరా కుక్కనాకొడక, పోరా ! పోయి ఆల్ల సెప్పుల్నాక్కోని ఆల్లగుమ్మాలకాడే బతుకురా!" అని మల్లీ మరో తాపుతన్నినాడు సిన్నిగాడ్ని.

"ఆడక్కడువుంటే నిజింగ సంపేస్తాడో యేటోనని బయింవేసినాది నాకు. గంగులుగాడి మాట్లకి నానేటి జవాబు సెప్పనేకపోయినాను. అందికని సిన్నిగాడ్ని అక్కడ్నుండి నెగదీసి లాక్కెల్లిపోనాను. ఇప్పుడు సెప్పర సొట్టప్పియ్య - ఆ ముసిల్నాకొడుకు నచ్చియ్యిగాడెట్టినపెంటకాదేటిదంత?" బగాదిగాడు మాట్లని నీరైపోన్డు సొట్టప్పిగాడు. ఆడు మాత్రంవేటనగల్డు? కొసకన్నాడుగదా-

"తమ్ముడోరే, నాన్నీకంట పెద్దోడ్ని, నా సిన్నప్పుడికాడ్నుండి కనిపెడతన్నానుగదా - ఈ నచ్చియ్యిగాడు తగూలెట్టే సజ్జకాదుర! ఎవులేన తగూలుపడితె, ఆడొచ్చియిడిపించడంవే సూసినానుగాని, ఆడు తగూలుపెడ్డంనానింతవరకు సూడ్నేదుర !"

"ఏటోన్రప్పిగ - తగూలెట్టేవోడో, తగూల్తీర్సేవోడో, నాకు తెల్దుగాని - సిన్నిగాడికి అగ్గెట్టించేసినోడు మాతరం ఆడే. గంగులుగాడి దెగ్గిరికెల్లి సిల్లంగెట్టినాడు. తెలకంట అగ్గెట్నా - యిళ్లు కాలిపోకంటూరుకోవుగద! ఈడు సిల్లంగెట్నాడు - ఆడెర్రిపీర్నాగ కొడుకుని బాదేసినాడు. సిన్నిగాడు ఏనాడు ఒక్క మాటగాని, దెబ్బగానీ కాసున్నోడుకాదు. దెబ్బల్తిని, తిట్లుకాసేతప్పటికి ఆడికెక్కడ్లేని రోసం ఎలిసొచ్చినది. ఆ ఎంట్నే సెర్లోపడిపోతానని పరిగెట్టినాడు. నాను బలవంతంగ ఆపినాను.

"నన్నాపకరా బగాది, మాలయ్య ఏటన్నాడో యిన్నావుగదురా! నానంట, నా కుటంవాన్ని

బుగ్గిసేసీసి నోళ్ళ పంచస్పేరతన్నానట. సాయాన మాఅయ్యే యినాగన్నప్పుడు మరేట్ర నాకీబతుకు? నన్నొగ్గిరా ఎండలో ఒకందల పడిసస్తాను" అని గింజుకున్నాడు. అడ్ని ఆపీ తప్పుటికి నాపేణాలు సొలొచ్చినాయి. అయితేటి సెయ్యి గలిగినాను? ఆసిటంకి ఆపినానంతే! రేతిరిమీదెల్లి ఎవులూ సూడకంటున్న టయింవుల సెర్లబడిపోన్డు. ఆడికంత సౌరుసం! " సీ, నువ్వు నాకుటంవల్ల సెడబుట్టినావని అయ్యి తిట్టినాట్ట". అందికని పేణాలొగ్గీసినాడు. ఆనాటి నేస్తం సౌనాక - మరేట్నేదనిపిస్తంది నాకీ బూమ్మీద" అన్నాడు బగాదిగాడు.

"తమ్ముడోరే, రోసాలు, సావులూ, బాదలు - యియ్యే మనకి బతుకులంట మిగిల్నాయి. సిన్నిగాడియాల సచ్చిపోనాడని ఈ పాలంవ్‌ల కూకొని నివ్వేడస్తన్నావు. మరి యిన్ని నచ్చుల గేంవాల్లో మన్నాటోల్లు యెంతమంది గోల బెడతన్నారో, ఏడస్తన్నారో మనకేటేనెరికా? మన్లాటోల్లకి మిగిలిందల్ల ఏడుపేట్ర. తమ్ముడోరే, నెగురానెగు, నెగిసింటికెల్లుమీ - రోజురోజల్ల నీట్లోనానిపోనావు - జబ్బుసేస్తాది - నెగురా ! సీకటయిపోతందో పక్కలెల్లి - నువ్వు నెగిసెల్లు - నాను నాలుగ్గడ్డిపరకల్తెవ్వీసిపారొస్తాను. అయినేక పోతే - నర్సునాయుడు నన్నియాల సంపేస్తాడు. మన్లాటోల్లంవ్ సచ్చిపోయినా పర్నేదు - ఆడుమాత్రం సుకం గుండాల! నెగు, నెగు".

(ఫిబ్రవరి 1979-అవగాహన)

✪ ✪ ✪